# కామదహనం

ఆ రోజు డ్యాన్సు స్కూలు వార్షికోత్సవము. వచ్చిన అతిథులకి స్వాగతం పలుకుతూ హెడ్‌మిస్ట్రెసు, "సంవత్సరం క్రితం మేము యీ స్కూలు స్థాపించినప్పుడు లక్షకు పైగా జనాభా వున్న యీ పట్టణంలో మాకు ఒక్కగా నొక్క విద్యార్థిని మాత్రం లభించింది. "గవర్నమెంటు దగ్గరనుంచి కాని ఏ సంస్థ దగ్గరనుంచి కాని ఎటువంటి ఆర్థిక సహాయం లేకుండా స్థాపించి యీ స్కూలు భవిష్యత్తు ఆనాడు చాలా గడ్డుగా కనిపించింది. కళలకు, కళాకారులకు పుట్టినిల్లయిన యీ పట్టణంలోని జనం, మా సంస్థను గుర్తించి మాకు చేయూత నిస్తారనే ఆశ మాత్రం మాలో అడుగంటలేదు. మా సంకల్పం సిద్ధింప చెయ్యటం కోసమే యీ వూరుకు వచ్చినట్టుగా డి.ఎమ్.వో గారు యీ వూరుకు వచ్చారు. వారి నిర్విరామ కృషికి ఫలితంగా యీనాడు మా స్కూల్లో అరవై మంది ఆడపిల్లలు,యిరవై మంది మగపిల్లలు శిక్షణ పొందుతున్నారు. చూస్తుండగానే సంవత్సరం గడచిపోయింది. వార్షికోత్సవం తలపెట్టాం. నృత్య పోటీకి జడ్జిగా వుంటడానికి తగినవారు ఎవరు అనే సమస్య వచ్చింది. నాట్యాచార్యులు కృష్ణమూర్తి పంతులుగారి దగ్గరకు వెళ్ళాం. వారు ఎంతో చల్లటి వార్త చెప్పారు. శ్యామలాదేవి గారిని ఆహ్వానించవలసిందని సలహా యిచ్చారు. శ్యామలాదేవిగారిని గురించి నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. వారు జగమెరిగిన వారు. నాట్యజగత్తులో మనదేశంలోనే కాదు, ప్రపంచం నలుదిక్కులా వారి కీర్తి వ్యాపించింది. వారు ఈ వూరు రావటం, మన యీ నాట్యపోటీలకి జడ్జిగా వుండటానికి అంగీకరించడం మా సంస్థ చేసుకున్న గొప్ప అదృష్టం.

పోటీ ప్రారంభమయ్యింది. మొదట్లో నలుగురు ఆడపిల్లలు, తరువాత యిద్దరు మగపిల్లలు జయదేవుడి అష్టపదులు అభినయం చేసారు. తరువాత ఒక పిల్ల క్షేత్రయ్య పదం అభినయించటం మొదలుపెట్టింది. ఆ పిల్లను చూడగానే శ్యామల ఉలిక్కిపడ్డది.

"ఎవరీ అమ్మాయి" అని అడిగింది.

"డి.ఎం.ఓ. మురళీధర్ గారి అమ్మాయి"

"మురళీధర్!"

"నీలం సూటు వేసుకుని రెండవ వరుసలో కూర్చున్నారే. ఆయనే"

శ్యామల ఆ వ్యక్తి వంక ఒకసారి చూసింది. అతను తన కుమార్తె చేసే నాట్యం చూడటంలో లీనమై ఉన్నాడు. శ్యామల మనస్సులోనుంచి ఒక చిరునవ్వు వచ్చింది. కాలచక్రం ఒక్కసారిగా 20 సంవత్సరాలు పరుగెత్తింది. ఆనాడు కృష్ణమూర్తిగారు తమ యింటికి వచ్చారు. తన విద్యను చూచి మెచ్చుకున్నట్టు తలవూపారు.

"మేము అన్ని సంస్థానాలు పర్యటన చేయబోతున్నాం. నువ్వుకూడా మా వెంట వస్తావా?" అని అడిగారు.

"వెళ్ళనా" అన్నట్టు తన తల్లిదండ్రుల వంక చూసింది.

"మా ఆడపిల్లలు కూడా వస్తున్నారు. వాళ్ళతో పాటు ఉంటుంది. శ్యామలకు ఏ లోటూ రానివ్వం" అని పంతులుగారు అన్నారు.

అమ్మా, నాన్నా సరేనన్నారు. తనకు అందలమెక్కినంత సంబరమేసింది.

మొట్టమొదటి ప్రదర్శనం 'విశ్వామిత్రుడు, మేనక' గవర్నర్ సమక్షంలో మద్రాసు మ్యూజియం థియేటర్లో జరిగింది. తను మేకప్ చేసుకుంటూ ఉంటే పంతులుగారు తనకు ఒక కుర్రవాడిని పరిచయం చేసారు.

"శ్యామలా! ఇతను మన మురళీధర్. ఎమ్.బి.బి.యస్. చదువుతున్నాడు. వైద్యం కంటే కూడా నాట్యం అంటేనే ప్రస్తుతం ఆసక్తి ఎక్కువ. మనతో పాటు రమ్మని పిలిచాను. ఇంతకాలానికి నీకు సరైన ఉజ్జీ దొరికిందయ్యా. రాధ వేషానికి శ్యామలను తర్ఫీదు చేస్తున్నాను."

అతను ఏం మాట్లాడలేదు. తనకు నమస్కారం చేసి తన గదిలోనికి వెళ్ళిపోయాడు.

ఆనాటి నృత్య ప్రదర్శనలో అతను విశ్వామిత్రుడు, తను మేనక. నాట్యం చూసిన ప్రతి ఒక్కరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. లాడ్జికి తిరిగి వచ్చేసరికి చాలా ప్రొద్దుపోయింది. పుచ్చపువ్వు లాంటి వెన్నెల కాస్తోంది. వెన్నెట్లో కూర్చొని అందరూ అతనితో చాలా చనువుగా మాట్లాడుతున్నారు. కానీ తనకు మాత్రం అతనితో మాట్లాడటానికి చెప్పలేనంత సిగ్గు వేసింది. మాటలు రానిదానిలాగే కూర్చుంది. ఈనాటి ప్రదర్శనం తన తల్లిదండ్రులు చూసి వుంటే ఎంతో సంతోషించేవారు. అమ్మకు ఉత్తరం రాయాలి. మురళీధర్ నృత్యం ఎంత బాగుంది! అమ్మ అతన్ని ఒక్కసారి చూస్తే అమ్మకు అతను తప్పక నచ్చుతాడు.

"చాలా ప్రొద్దుపోయింది" అని ఒక మెత్తటి కంఠం తనతో చెప్పింది.

ఉలిక్కిపడి తను అటు చూచింది. తనకు రెండు గజాల దూరంలో మురళీధర్ నిలబడి ఉన్నాడు. మాట్లాడకుండా అక్కడనుంచి లేచి లోపలికి వెళ్ళిపోయింది.

తను అలా లేచి వచ్చేసినందుకు ఏమైనా అనుకున్నాడో ఏమో! ఒక్కమాట మాట్లాడితే నష్టమేమిటి? ఏమో! తనకు చేతకాదు.

మదరాసు నుంచి బొంబాయి వెళ్ళారు. అక్కడ మురళీధర్ కృష్ణుడు. తను రాధ. "మధురా నగరిలో చల్లనమ్మ బోదు" యీ పాట అభినయం చేస్తూ ఉంటే ప్రేక్షకులు పరవశంతో ఎన్నిసార్లు చప్పట్లు కొట్టారో, ఎన్నిసార్లు వన్స్‌మోర్ అని అరిచారో లెక్కలేదు. అతని వేషం చూసి నిజంగా కృష్ణుడు ఇలాగే వుండేవాడేమో ననిపించింది. గ్రీన్‌రూమ్‌లో మేకప్ తుడుచుకుంటూంటే అతను వచ్చాడు.

"మీ నాట్యం అద్భుతంగా వుందని అంతా అంటున్నారు" అని అన్నాడు.

"మీకు ఎల్లా ఉంది. నచ్చిందా?" అని తను అడుగుదామని అనుకుంది. కానీ అడగలేదు.

తన బల్ల దగ్గర మూడు గులాబీల గుత్తి ఒకటుంది. మొదట్లో తను ఆ గదిలోకి వచ్చినప్పుడు లేదనుకుంటా... మురళీధర్ తీసుకొచ్చాడేమో... ఈ ఆలోచనతోనే తనకు అంతులేని ఆనందం కలిగింది.

"మురళీధర్ ఎంత మంచివాడు" అని అనుకుంది.

బొంబాయి పురజనుల కోరికమీద మరునాడు కూడా రాధాకృష్ణుల నృత్యమే జరిగింది. మళ్ళీ ఇంకొక గులాబీల గుత్తి తన గదిలోకి వచ్చింది. ఈసారి తను ఊరుకోలేదు. అతని కోసం వెతుక్కుంటూ వెళ్ళింది. గురువుగారి దగ్గర కూర్చుని మాట్లాడుతున్నాడు.

తనను చూచి గురువుగారు చిరునవ్వుతో "ఏమమ్మా శ్యామలా?" అని పలకరించాడు. తను చెప్పదల్చుకున్న విషయం ఒక్క క్షణం మర్చిపోయింది. తన చేతిలో గులాబీలు ఆయన పాదాలచెంత వుంచి నమస్కరించింది.

'పిచ్చి పిల్లా' అని ఆయన అన్నారు. కాని పూలగుత్తి మాత్రం మురళీధర్‌కి యిచ్చారు. తను మాట్లాడకుండా నిలుచుంది. తన వాలకం గ్రహించి

"కూర్చోవమ్మా" అని అన్నారు.

"నా గదిలో ఎవరో రోజా గులాబీలు పడేసి వెడుతున్నారు."

"ఎవరో" అని గురువుగారు అడిగారు.

"తెలియదు."

"తెలియకపోతే అవశ్యం కనుక్కోవాలి. నిన్ను అనుదినం పువ్వులతో పూజించేవారెవరో తెలుసుకోకపోతే ఎల్లా? అంతే కాదయ్యా మురళీ?"

"మీ నాట్యం అద్భుతంగా వుందని అంతా అంటున్నారు" అని అన్నాడు

తను ఒక్కసారి మురళి వంక చూసింది. అతను మాట్లాడకుండా తల వంచుకున్నాడు. తనకు .కోపం వచ్చింది.

"ఇకనుంచీ ఎప్పుడూ ఇలా చేయకండి" అంటూ అక్కడనుంచి వెళ్ళి పోయింది.

తరువాత వారం రోజులదాకా ఇద్దరూ మాట్లాడుకోనేలేదు. ఢిల్లీలో కుతుబ్‌మినార్ దగ్గర మురళి తనను పలకరించాడు.

"నన్ను అపార్థం చేసుకున్నారు."

తనేం మాట్లాడలేదు.

"గదిలో గులాబీలు పెట్టింది నేను కాదు." ఆ మాట వినగానే తనకు ఎంతో బాధ కలిగింది. వెంటనే కోపం కూడా వచ్చింది.

"నిజం!" అని అడిగింది.

"అబద్ధం వల్ల నాకు వచ్చే లాభం?"

"ఆ మాట ఆనాడే చెప్పవచ్చుగా!"

"మీరు వినిపించుకునే స్థితిలో లేరుగా..."

"మీరు చాలా అనుభవం మీద మాట్లాడుతున్నారే?"

"నాతో పోట్లాడ్డమే మీ వుద్దేశ్యంలా కనిపిస్తోంది."

"మన ఉద్దేశాలే ఇతరులలో కనిపిస్తాయి."

"శ్యామలాదేవిగారూ! మనమంతా ఒక ప్రత్యేకమైన పని నిమిత్తం వచ్చాం.'

"ఆ విషయం కొందరు మర్చిపోతున్నారుగా!"

"రేపు వైస్రాయి భవనంలో మన ప్రదర్శన యివ్వబోతున్నాం. మనం వారిని మెప్పించగలిగితే ఇంగ్లండు, యూరప్ వెళ్ళడానికి అవకాశం కలగవచ్చు.'

"మీరు కూడా యూరప్ వస్తారా?"

"రాను."

"ఎందుకని?"

"జూలైలో కాలేజీలు తెరుస్తారు."

"దీనికంటే కాలేజీ ముఖ్యమా?"

"నాట్యం నా సంతోషం కోసం నేర్చుకున్నాను. కానీ డాక్టరు కావటం నా విధి."

"దేశానికి డాక్టర్లే కాదు, కళాకారులు కూడా కావాలి."

"నిజమే. నాలాంటివాళ్లు కాదు. ఉత్తమ కళాకారులు కావాలి."

"అలా అనకండి. మీకంటే ఉత్తమ కళాకారులు ఎవరు?"

"ఉత్తమ కళాకారులంటే మన గురువుగారి వంటి కళాద్రష్టలు, కళాస్రష్టలు. మీతో ఒక విషయం చెప్పనా?"

తనకు అంతులేని భయం వేసింది. ఒళ్ళంతా వణికిపోయింది. ఎందుకో తనకు అర్థం కాలేదు.

"ఏమిటది?"

"మీకు సలహాలు యివ్వగలిగినవాడిని కాను."

"చెప్పండి."

"యూరప్ వెళ్ళడానికి అవకాశాలు వస్తే కాదనకండి."

"మీ మాటలు నాకు అర్థం కావటం లేదు."

"మీ తల్లిదండ్రులు కాదంటారేమో! అవసరమైతే గురువుగారితో చెప్పించి వారిని ఒప్పించండి."

"నేను కాపోతే ఇంకొకరు వెళతారు."

"ఆ మాట అంటారనే నాకు భయం."

"దాని వల్ల నష్టం?"

"మీ వంటి ఆర్టిస్టు దేశానికి వన్నె తెస్తుంది. మీ నాట్యం చూస్తే పాశ్చాత్యు మీతో బాటు మనదేశాన్ని కూడా గౌరవిస్తారు."

"బానిసదేశాన్ని ఎవరు గౌరవిస్తారు?"

"దేశం బానిసదైనా ప్రజలు బానిసలు కారని గుర్తిస్తారు. అవకాశం వస్తే యూరప్ వెడతారు కాదూ..."

"అవకాశం వస్తే తప్పక వెడతాను."

మరునాడు వైస్రాయ్ సమక్షంలో నృత్య ప్రదర్శన జరిగింది. రెండు రోజుల అనంతరం యూరప్ ప్రయాణం స్థిరపడ్డది. అంతా కలసి వెన్నెలలో తాజ్‌మహల్ చూడడానికి వెళ్ళారు. తనొక తిన్నెమీద కూర్చొని తాజ్‌మహల్ అందం చూస్తోంది.

'శ్యామలాదేవిగారూ' అని మురళీధర్ కంఠం వినిపించింది.

"నేను అన్నివిధాలా మీకంటె చిన్నదాన్ని. ఎవరో పరాయివాళ్ళని పిలిచినట్టుగా శ్యామలాదేవిగారు అంటారు దేనికి?"

"వయస్సులో చిన్నవారే. విద్య ప్రావీణ్యతలో మన యిద్దరి మధ్యా ఎన్నో యోజనాల దూరం వుంది. మిమ్మల్ని మీరు అని పిలవడమే సమంజసం."

"ఈ హెచ్చు తగ్గులు పరాయివారి మధ్య."

"మీరు నాతో ఎక్కువగా మాట్లాడకపోయినా నా యందు ఎంతో ఆత్మీయత కనపరుస్తారు ఈ స్నేహం..."

"స్నేహమా?"

"ఈ స్నేహం యీ ఆదరణ యీనాటివిగా నాకు కనిపించడంలేదు. ఎన్నో రోజుల నుంచి మనం ఒకరి కొకరు తెలుసుననిపిస్తుంది. ఇల్లా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోకండి"

శ్యామల ఏం మాట్లాడలేదు. కాని అతని మాటలలో అనిర్వచనీయమైన ఆనందం కలిగించే మత్తుమందు ఏదో వుంది. అతని ఎదుట తన వాణి మూగపోతుంది. అతని సమక్షంలో తనకు అంతులేని సిగ్గు. కాని అతను ఎదుట లేకపోతే అర్థంకాని ఆవేదన. ఎందుకని? ఏమో తనకు తెలియదు.

"నేను రేపు మా వూరు వెళ్ళిపోతున్నాను."

"రేపేనా?"

అతను ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు.

"మిమ్మల్ని ఒక్కటి ప్రార్థిస్తున్నాను కాదనరుగా."

శ్యామల వెంటనే ఏం మాట్లాడలేదు. క్షణంలో తెప్పరిల్లుకుని

"చెప్పండి."

"నేను ఒక పిల్లని ప్రేమిస్తున్నాను."

వాళ్ళిద్దరి మధ్యా ఒక్క క్షణం పిడుగులాంటి నిశ్శబ్దం.

"ప్రేమిస్తున్నారా? ఎవరిని?" అని శ్యామల మెల్లిగా వణుకుతున్న కంఠంతో అన్నది. అతనేం మాట్లాడలేదు. తాజ్‌మహల్ పైన ఉన్న చంద్రవంకను చూస్తున్నాడు. అతనేం చెపుతాడో విందామని శ్యామల ఎదురుచూస్తోంది. తన ప్రశ్నకు సమాధానంగా,

"నిన్ను ప్రేమిస్తున్నాను శ్యామలా" అని అతని చేత అనిపించమని భగవంతుడిని మనస్సులో మ్రొక్కుకుంది. కాని అప్పటికీ అతను మాట్లాడక పోయేసరికి కొంటెగా,

"చెప్పడానికి సిగ్గుపడుతున్నారా?" అని అడిగింది.

"లేదు."

"మరి?"

"వాళ్ళది మావూరే." శ్యామలకి గుండె ఝల్లుమన్నది. కాళ్లలోంచి వణుకు పుట్టుకువచ్చింది.

"మేము ఒకరినొకరం గాఢంగా ప్రేమించుకున్నాం. మా వివాహానికి, మా తల్లిదండ్రులు, వాళ్ళ తల్లిదండ్రులు అంగీకరించినట్టుగా ఈ రోజు ఉత్తరం వచ్చింది. శ్యామలాదేవిగారూ, మా వివాహానికి మీరు తప్పక రావాలి. మీవంటి గొప్ప ఆర్టిస్టు మా ఉభయులకీ స్నేహితురాలిగా ఉండాలని మా ఆకాంక్ష."

"ఆవిడ ఎట్లా ఉంది?"

"అంత మెత్తటి మనస్సు గల వ్యక్తిని ఎక్కడా చూడం."

"నాట్యం చెయ్యగలదా?"

"చేతకాదు."

"సంగీతం?"

"రాదు."

"ఆవిడ చాలా అదృష్టవంతురాలు."

"అంతకంటే నేనే ఎక్కువ అదృష్టవంతుణ్ణి."

"ఎందుకని?"

"తను ఎంతో మంచి మనిషి"

"మీకంటేనా?"

"మా వివాహానికి మీరు తప్పక వస్తారు కదూ?"

"మీరు పిలుస్తారా?"

"పిలవడమేమిటి? రమ్మని ప్రార్థిస్తున్నాను."

మరునాడు మురళీధర్ వెళ్ళిపోయాడు. వెళ్ళేముందర తన గదిలోనికి వచ్చాడు. తనతో మూడు ముక్కలు మాట్లాడాడు.

"వెళుతున్నాను. దయ ఉంచండి. మరచిపోకండి."

శ్యామల కన్నీటితో యుద్ధం చేస్తూ రెండు చేతులూ జోడించి నమస్కారం చేసింది. మురళీధర్ వెళ్ళిపోయాడు. తను ఎంతసేపు ఏడుస్తూ కూచుందో తెలియదు.

యూరప్ యాత్ర ప్రారంభమయ్యింది. ప్రతీచోటా తమ ప్రదర్శనాలు దిగ్విజయంగా జరిగాయి. అందరూ తనని అభినందించేవారే. కానీ వారిలో మురళీధర్ కంఠం వినిపించలేదు. ఆ రోజు ప్రదర్శనం పారిస్‌లో. ప్రేమకు, శృంగారానికీ, రసికతకూ ప్రాధాన్యం యిచ్చే యీ జాతి ప్రజలకు ఎటువంటి నృత్యం చూపించాలనే ప్రశ్న వచ్చింది. గురువుగారు ఒక్క క్షణం ఆలోచించి,

"కామదహనం" అన్నారు.

ఎందుకని ఎవరూ అడగలేదు.

కానీ ఆ ప్రశ్న ప్రతీ ఒక్కరి మనస్సులో మసలింది. అది గ్రహించి గురువుగారు,

"నూతన విషయాలు తెలుసుకున్నప్పుడే మనస్సుకు ఉత్సాహం, కుతూహలం కలిగేది. ఈ దేశవాసులకు మనదేశపు శృంగారపు అలవాట్లు, ఆచారాలు అంతగా తెలియవు. ప్రేమించడం, ప్రేమని పూజించడమే. జీవనపు ప్రధాన లక్ష్యంగా కల ఈ దేశ వాసులకి విషయవాసనని దగ్ధం చేసి, అతీతం, అలౌకికమైన ఆధ్యాత్మిక ప్రేమని అర్థించడం, సాధించడం వారికి కొత్త విషయాలు. ఈ నూతన పంథా వారికి చూపి, మన సంస్కృతిలోని ఔన్నత్యాన్ని వారికి తెలియపరచాలి. వారు సంతోషిస్తారు. మన శ్రమ ఫలిస్తుంది."

పరమ శాంతి స్వరూపులు కృష్ణమూర్తిగారు ఆనాడు ప్రళయ కాల రుద్రుడుగా రంగస్థలం మీదకు అవతరించారు. ఆయన కొడుకు శంకర్ మన్మథుడు, శ్యామల రతీదేవి నృత్యం జరుగుతూ ఉంటే- తాను, మురళీధర్ బొంబాయిలో చేసిన రాధాకృష్ణుల నృత్యం గుర్తుకు వచ్చింది. రంగస్థలం మీద తనకు కనిపించింది శంకర్ కాదు, మురళీధర్. త్రినేత్రుడి క్రోధాగ్నికి మన్మథుడు భస్మం అయ్యాడు. కెవ్వున కేక బెట్టి రతి నేల వొరిగింది.

కాలం ఎన్ని ఘడియలూ, విఘడియలూ గడిచిందో తనకు తెలియదు. కన్ను తెరచి చూచేసరికి తన గదిలో పక్కమీద పడుకుని వుంది.

"తల్లీ!" అని గురువుగారు పిలిచారు.

వెక్కి వెక్కి ఏడుస్తూ శ్యామల "ఇంటికి వెళ్ళిపోతాను" అని అన్నది.

"అట్లాగే తల్లీ" అని గురువుగారు అన్నారు.

మరునాడు మురళీధర్ వివాహపు శుభలేక అనేక దేశాలు తిరిగి తిరిగి తనకు చేరింది. అతని వివాహమై అప్పటికే ఒక పక్షం గడిచిపోయింది. వరుడు మురళీధర్. వధువు నిర్మల. శ్యామల కాదు నిర్మల.

"మన దేశం వెళ్ళిపోతున్నాం" అని గురువుగారు అన్నారు.

"అప్పుడేనా" అని ఎవరో అడిగారు.

"ఏ క్షణంలో నైనా యుద్ధం రావచ్చు. మనం వెంటనే వెళ్ళిపోవడమే శ్రేయస్కరం."

బొంబాయిలో తమ స్టీమరు ఆగగానే, సూటు వేసుకున్న వ్యక్తి ఎవరో గురువుగారికి నమస్కరించి హిందీలో ఏదో మనవి చేశాడు. గురువుగారు అంతా విని తల పంకించి "అచ్ఛా!" అని అన్నారు.

"కాశీ సరే శ్వరులకు మనం అతిథులం తల్లీ" అని అన్నారు.

కాశీ సంస్థానంలో తమని ఎంతగానో ఆదరించారు. తన నాట్యం చూసి మెచ్చుకొని మహారాణిగారు తమని అంతఃపురంలోకి రావలసిందిగా కబురు పంపారు. గురువుగారు వెంట రాగా తను వెళ్ళింది. ఆవిడ దగ్గర ఇద్దరు యువకులు కూర్చుని ఉన్నారు. తమ నమస్కారానికి ప్రతి నమస్కారం చేస్తూ ఆవిడ "ఎవరి ఆడపడుచువమ్మా?" అని అడిగింది.

"నరసింహదీక్షితుల వారి కుమార్తెను."

"నీ మాటలు వింటుంటే ఎంత సంతోషంగా వుందో చెప్పలేను. 'ఈ విద్య పాత్రతలేని వారి పరమైందని ఇంతకాలం బాధపడ్డాను. నిన్ను చూసాను. ఆ చింత తొలగిపోయింది. నిన్ను ఎట్లా మెచ్చుకోవాలో కూడా మాకు తెలియదు. కానీ నిన్ను చూస్తూ ఇటువంటి కుమార్తె వుంటే చాలు ఇహనేం అక్కర్లేదు అనిపించింది. ఎవరి కోడలువమ్మా?"

సమాధానం చెప్పడానికి తను సిగ్గుపడ్డది.

సమాధానం గురువుగారు చెప్పారు.

ఆవిడ ఎందుకనో ఒక్కక్షణం చిరునవ్వు నవ్వింది. తన సరసను కూర్చున్నవారిని చూపించి, "....... యువరాజు, ...... మా స్నేహితురాలి కుమారులు చంద్రశేఖరుడు" అని ఎరుక పరిచింది.

"ఈ సంస్థానంలో అనేక మంది నాట్యం చూశాము. కానీ వాళ్ళంతా మీకు తీసికట్టే" అని అతను స్వచ్ఛమైన తెలుగులో అనేసరికి తనకి ఎందుకనో అంతులేని ఆనందం కలిగింది.

"ఇంతటి చిన్నవయస్సులోనే ఇంతటి ప్రావీణ్యం సంపాదించడం ఆశ్చర్య పడవలసిన విషయం. మీరు చాలా అదృష్టవంతులు" అని అతను చెపుతున్నాడు.

"చంద్రానికి, ఆడపిల్లలతో మాట్లాడటానికి సిగ్గని విన్నానే" అని రాణిగారు అనేసరికి అతను తల వంచుకున్నాడు.

తను తల వంచుకుని నవ్వింది.

తనకొక చక్కటి బెనారస్ చీర, ఒక ముత్యాలహారం ఆవిడ బహూక రించారు.

బసకు తిరిగి వచ్చేసరికి ఆరాత్రి చాలా ప్రొద్దుపోయింది.

"రేపు చాలా పర్వదినం. తెల్లవారకుండానే లేచి గంగాస్నానం చెయ్యాలి' ' అని గురువుగారు అన్నారు.

"ఒక్క విషయం అడగనా?"

"తప్పకుండా."

"కాశీకి వచ్చినవాళ్లు తమకు ఇష్టమైనది వదిలిపెట్టాలని అంటారు ఎందుకని?"

"మనలో పెరిగిన వాంఛలు మనల్ని బానిసలుగా చేసికొని, మన వ్యక్తిత్వాన్ని నాశనం చెయ్యకుండా మనసుకి మనం లొంగిపోకుండా మనమే జయించడం కోసం మనకు ఎంతో యిష్టమైన వస్తువుని త్యజించమన్నారు. ఎంతో ఆత్మీయమైనదాన్ని, నిండు మనస్సుతో వదిలిపెట్టగల వ్యక్తి ప్రపంచంలో ఎటువంటి దుఃఖాన్నయినా ఎదుర్కొనగలడు. ఎటువంటి లక్ష్యాన్నైయినా సాధించగలడు."

"మీరు..."

"నేను కాశీయాత్ర అనేక సార్లు చేసాను. మొదటి సారి వచ్చినప్పుడు చాలా దుఃఖంతో వచ్చాను. భార్య అస్తికలు గంగాభవానీకి అర్పించడానికి వచ్చాను. అస్తికలతో బాటు నా యవ్వనాన్ని కూడా గంగామాత పాదాలచెంత అర్పించి ముసలివాడినిగా ఇంటికి వెళ్ళాను."

"ఎందుకని?"

"యవ్వనం నా భార్యని మరచిపోయేటట్టు చేస్తుంది. వార్ధక్యం ఆవిడని శాశ్వతంగా నా సమక్షంలో నిలుపుతుంది."

శ్యామల ఏం మాట్లాడలేదు. తన పక్కమీద పడుకుంది. కన్నీటితో ముఖమంతా తడిసిపోయింది. కొంతసేపటికి మనస్సు తేలికపడ్డది. ఒక నిశ్చయానికి వచ్చింది.

"ఇతరుల సొత్తు కోరడం మహాపాపం" అని అన్నది.

"ఏమిటి తల్లీ?" అని గురువుగారు అడిగారు.

శ్యామల మాట్లాడలేదు,

ఉషఃకాంతులు వచ్చాయి. గురువుగారు స్నానం చేసి ఆదిత్యుడికి అర్ఘ్యం యిచ్చారు. తను స్నానం చేసి, నృత్యం చేసేటప్పుడు కాళ్ళకి కట్టుకునే గజ్జెలను దోసిటతో పుచ్చుకుని

"తల్లీ! స్వీకరించవమ్మా" అంటూ నీటిలోకి జారవిడిచింది.

"శ్యామలా!" అంటూ గురువుగారు కేకబెట్టారు.

తను ఏం మాట్లాడలేదు.

"ఎంతపని చేసావు తల్లీ?"

తను ఒక్క క్షణం వారివంక చూసి చిరునవ్వుతో,

"నేను జయించాను" అని అన్నది. అంతకంటే ఎక్కువ చెప్పలేదు. ఎల్లా చెప్పగలదు? అందెల రవళిలో తనకు గోచరించే మూర్తి ఎవరు? పరాధీనమైన సొత్తు వాంఛించడం ఎంత పాపం? పాపమని తెలిసికూడా తన మనస్సు యిన్ని రోజులూ తన మాట వినలేదు. ఈ యమయాతనని తను భరించలేదు. తన పాదం చిందులు వేసినంతకాలం, తను గజ్జె కట్టినంతకాలం యీ పాపపు తలంపు తన మనస్సు నుంచి దూరం కాదు. ఈనాటితో యీ చెర విముక్తి కావాలి. కాకపోతే తనకు గంగాభవానే శరణ్యం. జయించగలననే ధైర్యం నిన్న రాత్రి వచ్చింది. జయించాననే నమ్మకం యీనాడు వచ్చింది. కానీ యీ మాటలు గురువుగారితో చెప్పడం ఎట్లా? అందుకనే తనేం మాట్లాడలేదు. గురువుగారి కంటివెంట కన్నీరు తిరిగింది.

కళ్లుమూసికొని "విశ్వేశ్వరా!" అని అన్నారు.

తనని చూచి తన వారెంతో సంతోషించారు. వారి ఆదరణలో, అనురాగంలో, తన మనస్సు వేచికున్న మనస్సే చెరిపివేసింది.

కాలచక్రం రెండు వసంతాలు గడచిపోయాయి.

గురువుగారి వెంట తనని చూడటానికి పెళ్ళివారు వచ్చారు. తనని చూడగానే పెళ్ళికొడుకు నమస్కారం చేసాడు. గురువుగారు నవ్వారు. తన తల్లిదండ్రులు విస్తుపోయారు. తన మనస్సు ఎగిరి గంతు వేసింది. సిగ్గుపడ్డది.

ఆనాడు కాశీసరే శ్వరుడి అంతఃపురంలో కనిపించిన చంద్రశేఖరుడు ఈనాడు తమ యింటకి వచ్చాడు. ఈ చంద్రశేఖరుడికి తను పార్వతి యైంది.

తన వివాహానికి గురువుగారు వచ్చారు. పట్టుచీరతోపాటు మూడు గులాబీల గుత్తి యిచ్చారు.

తను ఆశ్చర్యంతో "మీరేనా?" అని అడిగింది.

"పిన్నలని పెద్దలు పొగిడితే వారికి ఆయుక్షీణమని చెప్పలేకపోయాను. కాని నీ ప్రతిభను పూలతో పూజించకుండా వుండలేకపోయాను.

ఆ పూలగుత్తిని తన గురువుగారి చెంత వుంచింది. దంపతులు ఉభయులు ఆయన పాదాలకి నమస్కరించారు.

"నీలాంటి ఎందరో శ్యామలలకు కన్నతల్లివి కా తల్లీ!" అని మనస్సులోనే అశీర్వదించారు.

పద్దెనిమిది సంవత్సరాల నాడు దూరమైన మురళీధర్ ఈనాడు మళ్ళీ కనిపించాడు. అతనిని పలుకరిస్తే ఆనాటి స్మృతులు జ్ఞప్తికి వస్తే జరిగేదేమిటి? గతజల సేతుబంధనం వల్ల ప్రయోజనమేమిటి? ఐనా ఈ అనామకురాలు అతనికి

గుర్తుందో లేదో! వద్దు. మనస్సు మరచిన వాటిని మరిచిపోవటమే మంచిది. సభికుల కరతాళ ధ్వనులతో ఉలిక్కిపడ్డది. నాట్యం చేస్తున్న పిల్లవంక చూసింది. ఆ పిల్ల నాట్యం ముగించి సభికులకు నమస్కరిస్తోంది.

"పోటీ రిజల్టు యిస్తారా?" అని హెడ్‌మిస్ట్రెస్‌ను అడుగుతోంది.

శ్యామల తన ఎదుట ఉన్న కాగితం వంక ఒక్కసారి చూసింది. ఆ పూట నృత్యం చేసిన పిల్లలంతా ఒక్కసారి మనస్సులో మసిలారు. అందరినీ మించి మురళీధర్ కుమార్తె రూపం తన మనస్సుకు హత్తుకుని పోయినట్టు అనిపించింది. పెన్ను తీసి ఏదేదో రాయబోయింది. ఈ పోటీకి నీవు జడ్జివి అని మనస్సు హెచ్చరించింది.

"ప్రథమ బహుమతి కుమారి కళ్యాణి, రెండవ బహుమతి హేమచంద్ర, మూడవ బహుమతి కుమారి రాధ" అని రాసింది.

"అంతమంది జనంలో అధ్యక్షత వహించడానికి భయం వెయ్యలేదా?' ' అని చంద్రశేఖర్ అడిగాడు.

"మీరు దగ్గరవుంటే నాకే భయంలేదు" అని శ్యామల సమాధానం చెప్పింది.

శ్యామలాదేవిగారూ! నన్ను మరిచిపోయినట్టున్నారు. అందులో ఆశ్చర్య మేముంది. ఒకసారి ఆవిడని కలుసుకొని పలకరిస్తే ఆనాటి స్మృతులు జ్ఞప్తికి తెస్తే అంతటి గొప్ప వ్యక్తికి నాలాంటి ఒక సామాన్య ఆర్టిస్టు గుర్తుంటాడా! ఎవరు నువ్వని అడిగితే! వద్దు. ఈ గతజలసేతుబంధనం వల్ల ప్రయోజనమేమిటి? శూన్యం.

"రాధా! రామ్మా ఇంటికి వెళదాం" అంటూ మురళీధర్ కారు దగ్గరకు దారితీసాడు.